



టవర్‌సర్కిల్‌లో నిమజ్జనానికి తరలుతున్న అమ్మవారు

అంబికా.. సెలవిక..

నేత్రపర్వంగా దుర్గామాతల నిమజ్జన శోభాయాత్ర

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 13: శరన్నవరాత్రుత్సవాల సందర్భంగా పలు చోట్ల మండపాలు, వివిధ ఆలయాల్లో నెల కొల్పిన దుర్గామాత విగ్రహాల నిమజ్జన శోభాయాత్ర ఆదివారం నేత్రపర్వంగా కొనసాగింది. ఉద్వాసన పూజల అనంతరం ఉత్సవ కమిటీ నిర్వాహ కులు, కార్యకర్తలు, భక్తులు, భవానీ దీక్షాపరులు అమ్మవారి మూర్తులను వివిధ వాహనాల్లో మానకొండూరు, మానేరు, కొత్తపల్లి, చింతకుంట, దుర్శేడ్, బొమ్మకల్ చెరువులకు తరలించారు.

● టవర్ వద్ద మిన్నంటిన వేడుకలు..

టవర్ వద్ద నిమజన వేడుకలు మిన్నంటాయి. వాహనాన్ని పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించి అమ్మవారిని నిలిపారు. యువత, చిన్నారులు, టవర్ వద్ద గల వ్యాపారులు భారీ కాషాయ ధ్వజాలు చేతబూని, కేరింతలు, ఈలలు కొడుతూ నృత్యాలు చేస్తూ ముందుకు సాగారు. వివిధ ప్రాంతాలు, పలు ఆలయాలు, మంటపాల్లో నిలిపిన దుర్గామాత మూర్తులను టవర్, మంకమ్మతోట, కార్ఖానాగడ్డ, కోర్టుచౌరస్తా ద్వారా చెరువులకు నిమజ్జనానికి తరలించారు. వేడుకల్లో భక్తులు రెట్టించిన ఉత్సాహంతో పాల్గొన్నారు. నిమజ్జన వేడుకలకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రాజీవ్‌చౌక్, పాతబజార్, తెలంగాణచౌక్, మంకమ్మ తోట, మంచిర్యాలచౌరస్తా వంటి ప్రాంతాల్లో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు. పోలీస్ ఉన్నతాధి కారులు, అన్ని విభాగాల పోలీసులు ఎప్పటికప్పుడు భద్రతను పర్యవేక్షించారు.



ఎల్ఎండీ కాలనీలో..



మార్క్‌ఫెడ్ గ్రౌండ్‌లో మహిషాసుర దహనం

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 13: జిల్లా అంతటా శనివారం విజయదశమి వేడుకలు అంబరాన్నంటాయి. భక్తుల ప్రత్యేక పూజలు, వాహన, శమీ పూజలతో ఆలయాలు కిటకిటలాడాయి. భక్తులు ఆలయాలను సందర్శించి వేడుకల్లో పాల్గొన్నారు. శమీ పత్రాలను పెద్దలకు అందించి ఆశీస్సులు, స్నేహితులకు, కుటుంబసభ్యులకు అందజేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వివిధ ప్రాంతాల్లో మహిషాసుర సంహార లీలలను కన్నుల పండువలా నిర్వహించారు.

మహాశక్తి ఆలయానికి పోటెత్తిన భక్త జనం...

శమీ, వాహన, అమ్మవార్ల పూజలతో చైతన్యపురి మహాశక్తి ఆలయం జనంతో పోటెత్తింది. శమీ పూజలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ పాల్గొన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పదో రోజు విజయదశమి సందర్భంగా చైతన్యపురి మహాశక్తి ఆలయంలో కలెక్టర్ పమేలా సత్పతి దంపతులు, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ దంపతులు, ఆర్డీవో కుందారపు మహేశ్వర్ పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మహిళలతో కలసి దాండియా ఆడారు.

గిద్దెపెరుమాళ్ల ఆలయంలో...

రాంపూర్ గిద్దెపెరుమాళ్ల ఆలయంలో ఉదయం గణపతికి అభిషేక అర్చనలు, వాహనపూజలు జరిగాయి. మధ్యాహ్నం శమీపూజ, ఆలయ సమీపంలో రాత్రి మహిషాసుర సంహారలీలను నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ పమేలా సత్పతి దంపతులు, అడిషనల్ కలెక్టర్ ప్రఫు ల్ దేశాయ్, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, దేవాదాయశాఖ సహాయ కమీషనర్ నాయిని సుప్రియ, ఈవో ఎండపెల్లి మారుతి పాల్గొన్నారు. యజ్ఞ వరాహ క్షేత్రంలో అపరాజితా హోమం, పార్వేట ఉత్సవం, పంచాయుధపూజ, శమీపూజ జరిగాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్ రావు, సర్వవైదికసంస్థానం ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్ పాల్గొన్నారు. రాంనగర్ రమా సత్యనారాయణ, అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో శమీపూజ నిర్వహించారు. మార్క్‌ఫెడ్ గ్రౌండ్‌లో కార్పొరేటర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన శమీపూజ, రాంలీల వేడుకల్లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి హరిశంకర్ పాల్గొన్నారు. కిసాన్ నగర్ చింతల కింద జరిగిన శమీపూజలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పాల్గొన్నారు. శ్రీపురంకాలనీలో 38 అడుగుల రావణాసురుని విగ్రహాన్ని మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు పురుమల్ల శ్రీనివాస్ దహనం చేశారు.



మార్క్‌ఫెడ్ గ్రౌండ్‌లో బాణం ఎక్కుపెట్టి మహిషాసుర సంహారలీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్



మహాశక్తి ఆలయంలో శమీపూజలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్



గిద్దపెరుమాళ్ల దేవాలయంలో శమీపూజలో మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ దంపతులు, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

శక్తివంతమైన భారత నిర్మాణానికి సహకరిద్దాం
కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



శక్తివంతమైన భారతదేశ నిర్మాణానికి అందరం సహకరిద్దామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. విజయదశమి సందర్భంగా శనివారం చైతన్యపురి మహాశక్తి ఆలయం లో జరిగిన శమీ పూజ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్వార్థం, కల్మషం వీడి అందరూ కలసికట్టుగా ఉండాలన్నారు. గతంలో పడిన కష్టాలన్నీ తిరిగి రాకూడదని అమ్మవారిని వేడుకుంటున్నా నని తెలిపారు. ప్రజలకు సకల శుభాలు కలగాలన్నారు.

అందరికీ శుభాలు కలగాలి
మంత్రి పొన్నం ప్రభాకర్



అమ్మవారి ఆశీస్సులతో అందరికీ శుభాలు కలగాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం కరీంనగర్‌లో దసరా వేడుకల్లో గిద్దె పెరుమాళ్ల ఆలయంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేసే దిశగా తొలి దశలో ప్రతి నియోజక వర్గానికి 3500 చొప్పన ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో, మున్సిపాలిటీల్లో అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు సజావుగా కొనసాగేందుకు, స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యేంత వరకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.



మహాశక్తి ఆలయంలో కలెక్టర్ పమేలా సత్పతి









టవర్‌సర్కిల్‌లో దుర్గామాత ఊరేగింపులో మహిళలు, చిన్నారుల నృత్యాలు, కరీంనగర్ మార్క్‌ఫెడ్ గ్రౌండ్‌లో.., చొప్పదండిలో, తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలో రాంలీలా కార్యక్రమానికి హాజరైన ప్రజలు

వరి కోతలు ప్రారంభం



హుజూరాబాద్ మండలం సిర్సపల్లిలో వరి కోస్తున్న హార్వెస్టర్

హుజూరాబాద్, అక్టోబరు 13: వానాకాలంలో వేసిన వరి కోతలను రైతులు ప్రాంభించారు. వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రెండ్రోజులుగా రైతులు వరి కోతలను మొదలు పెట్టారు. కొనుగోలు కేంద్రాలపై ఇంకా ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోలేదు. కోసిన వరి ధాన్యాన్ని రైతులు ఆరబోస్తున్నారు. ఈ సీజన్ ప్రాంరంభంలో ఆశించిన వర్షాలు కురవలేదు. రైతులు బావులు, బోర్లలో ఉన్న నీటితోనే నాట్లు వేశారు. ఆగస్టు, సెప్టెంబరులో భారీ వర్షాలు కురిశాయి. దీంతో చెరువులు, కుంటలు నిండి భూగర్భజలాలు పెరిగాయి. ఈ సంవత్సరం రాష్ట్రప్రభుత్వం సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ ఇస్తానని ప్రకటించడంతో చాలా మంది రైతులు సన్నరకాల వైపు మొగ్గు చూపారు. సన్నరకాలకు ప్రభుత్వం ఐదు వందల బోనస్ ఇస్తుందా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇబ్బడిముబ్బడిగా వరిధాన్యం కొనుగోలు చేసి రైస్‌మిల్లర్లకు అప్పగించారు. ఈ ధాన్యాన్ని కొంత మంది మిల్లర్లు, అమ్ముకున్నారు. చాలా మంది మిల్లర్లు రాష్ట్ర ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు బాకీ ఉన్నారు. ఆ ధాన్యానికి సంబంధించిన సీఎంఆర్ ప్రభుత్వానికి ఇస్తేనే ఈ సారి ధాన్యం మిల్లులకు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో రైస్ మిల్లర్లు ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదు. ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. మరో 10 రోజుల్లో ఎస్సారెస్పీ ఆయకట్టు కింద వరి కోతలు జోరందుకుంటాయి. ప్రభుత్వం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

విద్యుత్ శాఖలో పూర్తయిన బదిలీలు

గణేశ్‌నగర్, అక్టోబరు 13: ఉత్తర తెలంగాణ విద్యుత్‌పంపిణీ సంస్థ (టీఎస్ ఎన్‌పీడీసీఎల్) కరీంనగర్ సర్కిల్ పరిధిలో చేపట్టిన సాధారణ బదిలీల ప్రక్రియ బదిలీ ఉత్తర్వుల్లో పలు మార్పులు చేస్తూ శుక్రవారం రాత్రి జాబితా విడుదల చేశారు. 15న రిలీవ్, 16 నుంచి బదిలీలపై నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ రూరల్‌తోపాటు హుజూరాబాద్ డివిజన్, ఎంఆర్‌టీ విభాగాల్లో ఉద్యోగులను బదిలీ చేశారు. కరీంనగర్ డివిజన్‌లో లైన్ ఇన్‌స్పెక్టర్స్ -16, లైన్‌మెన్-48, అసిస్టెంట్ లైన్‌మెన్ 6, స్వీపరు ఇద్దరు, వాచ్ మెన్ ముగ్గురు బదిలీ అయ్యారు. హుజూరాబాద్ డివిజన్‌లో లైన్ ఇన్‌స్పెక్టర్స్ 8, లైన్‌మెన్ 32, అసిస్టెంట్ లైన్‌మెన్ 35, జూనియర్ లైన్‌మెన్ 1, వాచ్‌మెన్ ముగ్గురు బదిలీ అయ్యారు. ఎంఆర్టీ డివిజన్లో టెస్టర్ గ్రేడ్-1 ఇద్దరు, టెస్టర్ గ్రేడ్- 2 ముగ్గురు, జూనియర్ లైన్‌మెన్ ఐదుగురిని బదిలీ చేశారు. పోస్టుల బదిలీ ఉత్తర్వులను ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ జారీ చేశారు. స్వీపర్లు 3, వాచ్‌మెన్ 2, సబార్డినేట్స్ 12, రికార్డ్ అసిస్టెంట్స్ 4, జూనియర్ అసిస్టెంట్స్ 16, సీనియర్ అసిస్టెంట్స్ 23, జేఏవో 18, ఫోర్మెన్ గ్రేడ్-1 కేడర్ 4, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్స్ 10, సబ్‌ఇంజినీర్లు 31, అసిస్టెంట్ ఇంజినీర్లు 48, ఏడీఈ 12 మందిని బదిలీ చేశారు.

వైద్య కళాశాలలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

భగత్‌నగర్, అక్టోబరు 13: కొత్తపల్లి వైద్య కళాశాలలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ వైద్యకళాశాల, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో కాంట్రాక్టు పద్ధతిన సివిల్ అసిస్టెంట్ సర్జన్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టులు భర్తీ చేస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు కళాశాల వెబ్‌సైట్‌లో అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు నింపి 15న ఉదయం 10 గంటల నుంచి 3 గంటల వరకు నిర్వహించే వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్స్, రెండు సెట్స్ జిరాక్స్ కాపీలు వెంట తీసుకురావాలని సూచించారు. నోటిఫికేషన్, పూర్తి వివరాలు కళాశాల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

నేటి నుంచి డిగ్రీ కళాశాలల నిరవధిక బంద్

గణేశ్‌నగర్, అక్టోబరు 13: కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలలను సోమవారం నుంచి నిరధికంగా మూసివేయాలని యాజమాన్యాలు నిర్ణయించాయి. రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీ యింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయక పోవడంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని యాజమాన్యాలు అంటున్నాయి. డిగ్రీ, పీజీ కాలేజీలను నిరవధికంగా మూసి వేస్తున్నట్టు శాతవాహన యూనివర్సిటీ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఎస్‌యూపీఎంఏ) ఓ ప్రకటన విడుదల చేసింది. దసరా సెలవులు ముగిసిన తరువాత కూడా కాలేజీలను మూసి ఉంచాలని, తరగతులు నిర్వహించకూడదని నిర్ణయించినట్లు సంఘం అధ్యక్షుడు ఎస్ వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి శ్రీపాద నరేష్ తెలిపారు. ఎస్‌యూ పరిధిలోని డిగ్రీ, పీజీ కాలేజీలను నిరవధికంగా మూసివేస్తున్నామన్న విషయాన్ని యూనివర్శిటీకి కూడా తెలియజేస్తామన్నారు. ఎస్‌యూ పరిధిలో ఉన్న 60కి పైగా కాలేజీలకు 120 కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయి.

పోలీస్ కమిషనరేట్‌లో ఆయుధ పూజ





ఆయుధ పూజ, వాహన పూజలో పాల్గొన్న సీపీ అభిషేక్ మొహంతి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 13 : పోలీస్ కమిషనరేట్‌లో దసర పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు కమిషనరేట్ కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో సీపీ అభిషేక్ మొహంతి ఆయుధ, వాహన పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కమిషనరేట్ ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీలు విజయ్‌కుమార్, మాధవి, ఆర్ఐలు రజనీకాంత్, కుమారస్వామి, జానిమియా, శ్రీధర్‌రెడ్డి, సీఐ సృజన్‌రెడి పాల్గొన్నారు.

విషాదాంతమైన వివాహిత ప్రేమ వ్యవహారం

- రెండు రోజుల క్రితం యువకుడి హత్య - ఆత్మహత్యకు పాల్పడిన మహిళ

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 13: మహిళ ప్రేమ వ్యవహారం విషాదాంతమైంది. రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. వివాహితను ప్రేమించిన యువకుడు రెండు రోజుల క్రితం హత్యకు గురికాగా... సదరు వివాహిత సైతం ఆదివారం ఆత్మహత్య చేసుకున్నది. గోదావరిఖని బాపూజీనగర్‌కు చెందిన అంజలికి సింగరేణి ఏరియా హాస్పిటల్‌లో స్కావెంజర్‌గా పనిచేస్తున్న వడ్లాది వినయ్‌కుమార్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. అప్పటికే పెళ్ళి అయి భర్త ఇద్దరు సంతానం ఉన్న అంజలిని వినయ్‌కుమార్ రెండు నెలల క్రితం గుడిలో పెళ్ళి చేసుకున్నాడు. పెళ్ళికి ఇరుకుటుంబాలు అంగీకరించకపోవడంతో కాలనీలోని హనుమాన్‌నగర్‌లో నివసిస్తున్నారు. ఈక్రమంలో ఈనెల 10న అంజలి భర్త, సోదరుడు కాలనీలోని వినయ్‌కుమార్ ఇంటికి వచ్చి కత్తులతో దాడి చేసి హత్య చేశారు. వినయ్ కుటుంబ సభ్యులు అంజలితో పాటు వారి కుటుంబ సభ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన తర్వాత ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా నల్లజర్లలో బంధువుల ఇంట్లో ఉంటున్న అంజలి ఆదివారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

ధర్మపురిలో వైభవంగా దసరా ఉత్సవాలు


శమీ వృక్షం వద్ద పూజలో పాల్గొన్న ప్రభుత్వ విప్, అధికారులు


గాలిలోకి కాల్పులు జరుపుతున్న ధర్మపురి సీఐ, ఎస్ఐ

ధర్మపురి, అక్టోబరు 13: ధర్మపురి క్షేత్రంలో దసరా ఉత్సవాలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్రం లక్ష్మీనృసింహస్వామి, వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ఆలయం నుంచి చింతామణి చెరువు గట్టు మీదుగా క్షేత్ర సమీపంలో గల నూతన జమ్మిగద్దె వరకు ఊరేగింపు జరిపారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య శమీ వృక్ష పూజలు నిర్వహించారు. పోలీస్ శాఖ పక్షాన ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ గంగుల మహేష్ గౌరవ వందనంగా తుపాకితో రెండుసార్లు గాలిలోకి కాల్పులు జరిపారు. అనంతరం స్వామి వారల సేవలను అక్కడి నుంచి కమలాపూర్ చౌరస్తా, బస్ స్టేషన్, బ్రాహ్మణ వీధి మీదుగా ఇసుక స్తంభం వరకు ఊరేగింపు జరిపారు. ఇసుక స్తంభం వద్ద గల మండపంలో ప్రత్యేక పూజలు అనంతరం స్వామి వారల సేవలను తిరిగి ఆలయానికి తీసుకువచ్చారు. ఆలయం పక్షాన స్థానిక బస్‌స్టేషన్ ఆవరణలో ఈవో సంకటాల శ్రీనివాస్ రావణ దహనం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని రాత్రి వరకు తిలకించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, టీపీసీసీ సభ్యుడు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కు రవీందర్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సింహరాజు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● శమీ పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ అడ్లూరి

ధర్మపురి క్షేత్ర సమీపంలో గల జంబి గద్దె వద్ద నిర్వహించిన శమీ వృక్ష పూజల్లో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతం శమీ వృక్ష పూజకు బయలు దేరిన స్వామివారల సేవను ఆయన మోసి భక్తిప్రపత్తులు చాటుకున్నారు.

● వేములవాడలో రాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు

వేములవాడ కల్చరల్: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. విజయదశమి పర్వదినాన్ని పురష్కరించుకొని శనివారం రాజరాజేశ్వరీ దేవి అమ్మవారు మహాలక్ష్మి (పాలవెల్లి) రాజరాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. పార్వతిపరమేశ్వరులు, లక్ష్మీసమేతపద్మనాభస్వామి ఉత్సవమూర్తులకు అంబారీ సేవపై పూజలు నిర్వహించారు. అనంతరం పెద్ద సేవతో పట్టణ పురవీధుల్లో శమియాత్ర నిర్వహించారు. మహాలక్ష్మీ వీధిలోని జమ్మిచెట్టు వరకు ఊరేగింపు నేత్రపర్వంగా కొనసాగింది. శమియాత్రలో భాగంగా పెద్ద సేవలో పాల్గొనేందుకు హాజరైన భక్తులు పెద్ద సంఖ్యలో పార్వతీపరమేశ్వరులను దర్శించుకున్నారు. ముందుగా ఆలయంలోని లక్ష్మీపద్మనాభ ఆలయ ప్రాంగణంలో ఆయుధాలను ఒక్కచోట పేర్చి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయుధ పూజ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముందుగా రాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకుని ఆయుధ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.


వేములవాడలో అంబారీ సేవపై ఊరేగుతున్న ఉత్సవమూర్తులు


రాజన్న ఆలయంలో ఆయుధ పూజలో పాల్గొన్న ఆది శ్రీనివాస్

అదుపు తప్పిన కారు

- రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్‌కు ఢీ


రోడ్డు కిందకు దూసుకెళ్లిన కారు

సుల్తానాబాద్, అక్టోబరు 13: సుల్తానాబాద్ మండలంలోని సుగ్లాంపల్లి వద్ద కారు వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న కల్వర్ట్‌లో పడి పోయింది. అక్కడే ఉన్న 15 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గోదావరిఖని ఎన్టీపీసీకి చెందిన పోతు అశోక్ అనే వ్యక్తి ఆదివారం ఉదయం తన కుటుంబసభ్యులను కారులో కరీంనగర్‌లో దింపి తిరిగి మధ్యాహ్నం ఎన్టీపీసీ వస్తున్నాడు. ఈ క్రమంలో సుగ్లాంపల్లి వద్ద కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. షార్ట్ సర్క్యూట్ జరగకపోవడంతో ప్రమాదం తప్పింది. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

రేణికుంట టోల్ గేట్ వద్ద వాహనాల రద్దీ

- కిలోమీటర్ మేర నిలిచిన వాహనాలు - హైదారాబాద్ వైపు వెళ్లే వాహనాదారులకు ఇబ్బందులు

తిమ్మాపూర్, అక్టోబరు 13: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట గ్రామం వద్ద రాజీవ్ రాహదారిపై ఉన్న టోల్‌గేట్ వద్ద ఆదివారం కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో కరీంనగర్ నుంచి హైదారాబాద్ వైపు వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడ్డారు. దసరా పండగ సందర్భంగా హైదారాబాద్ నుంచి తమ స్వగ్రామాలకు వచ్చిన వారు తిరిగి ఆదివారం హైదారాబాద్‌కు పయనమయ్యారు.

కరీంనగర్ నుంచి హైదారాబాద్ వైపునకు వెళ్లే వారు ఎక్కువ ఉండడంతో వందల సంఖ్యలో వివిధ రకాల వాహనాలు రేణికుంట టోల్ గేట్ వద్ద బారులు తీరాయి. కిలోమీటర్ వరకు వాహనాలు బారులు తీరడంతో వాహనాదారులు ఇబ్బందిపడ్డారు. చివరికి సిబ్బంది టోల్ డబ్బులు తీసుకోకుండానే లైన్‌లో వచ్చినవి వచ్చినట్లు పంపించారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది.


టోల్ ప్లాజా వద్ద బారులుదీరిన వాహనాలు

దసరా వేడుకల్లో అపశృతి

- విద్యుదాఘాతంతో యువకుడి మృతి
- గ్రామంలో నిలిచిన వేడుకలు

భీమారం, అక్టోబరు 13: జగిత్యాల జిల్లా భీమారం మండలంలోని రాగోజీపేట గ్రామంలో దసరా వేడుకల్లో శనివారం అపశృతి చోటు చేసుకుంది. గ్రామంలో దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని మహిషాసుర మర్దన కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలోనే మహిషాసురుడికి నిప్పు పెట్టే ప్రయత్నంలో విద్యుత్ తీగను గ్రామానికి చెందిన అరిసెల వెంకటేష్ (35) సరి చేసే క్రమంలో అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు వైరు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై కుప్పకూలాడు. గమనించిన స్థానికులు వెంటనే జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంకటేష్ మృతితో గ్రామంలో దసరా ఉత్సవాలు ఆగిపోయాయి. మృతుడికి భార్య, కూతురు ఆద్య(10), కొడుకు ఆర్యన్(6) ఉన్నారు. మృతుడు వెంకటేష్ భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై శ్యాంరాజ్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


వెంకటేష్ (ఫైల్)

'నిత్యాన్నదానం' సరుకులు చోరీ

● కొండగట్టు అంజన్న సన్నిధిలో ఘటన
● సదరు అధికారికి మెమో జారీ

మల్యాల, అక్టోబరు 13: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థనం పరిధిలో నిర్వహిస్తున్న నిత్యాన్నపథకంకు వినియోగించే సరుకులు చోరీకి గురైనట్లు వచ్చిన ఫిర్యాదులపై అధికారులు సంబంధిత అధికారికి మెమో జారీ చేశారు. కొండగట్టులో నిర్వహిస్తున్న నిత్యాన్నదానం పథకంలో భాగంగా అన్నదానానికి వినియోగించే సరుకులను ఈ నెల 9న ఆటోలో తరలించిన్నట్లు పలువురు దేవస్థానం అధికారులక ఫిర్యాదు చేశారు. దీంతో సీసీ కెమెరాలను అధికారులు పరిశీలించినట్లు తెలిసింది. ఈవో రామకృష్ణరావు ఆదేశాల మేరకు ఆదివారం ఏఈవో అంజయ్య అన్నదానం ఇన్‌చార్జి రాములుకు మెమో జారీ చేశారు. 24 గంటల్లోపు సంజాయిషీ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. సదరు అన్నదానం ఇన్‌చార్జి గతంలో పని చేసిన చోట ఇలాంటి ఆరోపణలు ఉన్నట్లు చర్చించుకుంటున్నారు. అయితే అన్నదానం సరుకుల అక్రమ తరలింపుపై అధికారులు విచారణ జరిపి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎస్సారెస్పీ కాలువలో మృతదేహం గుర్తింపు

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు 13: మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రామానికి చెందిన సుంకేట కొండస్వామి(46)అను వ్యక్తి మృతదేహం ఎస్సారెస్పీ కాలువలో ఆదివారం గుర్తించారు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల 10న ఇంట్లో ఎవరికి తెలపకుండా వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమం లో మేడిపల్లి మండలంలోని కట్లకుంట గ్రామసమీపంలోని ఎస్సారెస్పీ కాలువ లో సుంకేట కొండస్వామి మృతదేహం కనిపించగా కుటుంబ సభ్యులకు తెలి పారు. మెట్‌పల్లి వెళ్లి తిరిగి మెట్లచిట్టాపూర్‌కు వస్తున్న క్రమంలో వెల్లుల్ల గ్రామశివారులోని ఎస్సారెస్పీ కాలువ సమీపంలో బహిర్భుమికి వెళ్లి ప్రమాదవ శాత్తు అందులో పడి మృతి చెంది ఉంటాడని కుటుంబసభ్యులు, పోలీసులు భావిస్తున్నారు. మృతుడి కొడుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో దాడి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

● దసరా వేడుకల్లో ఘర్షణ

మల్యాల, అక్టోబరు 13: దసరా వేడుకల సందర్భంగా మండలంలోని ఓగులాపూర్‌లో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ కత్తులతో దాడికి దారి తీయగా ఈ ఘటనలో ఇద్దరు గ్రామస్థులు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో దసరా వేడుకల్లో భాగంగా శనివారం గ్రామస్థులు శమి పూజకు వెలుతున్న క్రమంలో గ్రామానికి చెందిన రెండు వర్గాల మధ్య ఘర్షణ నెలకొని వాగ్వాదం జరిగింది. రాత్రి వేళల్లో మళ్లీ ఇరువర్గాలు గొడవ పడగా ఒక వర్గానికి చెందిన ఏడుగురు వ్యక్తులు కత్తితో దాడి చేయడంతో మేరుగు మనోహర్ అనే యువకుడు కత్తిపోట్లకు గురయ్యాడు. ఇదే గొడవలో మండల మహేశ్ అనే వ్యక్తి తన కొడుకు దినేశ్ కోసం వెళ్లగా వారిపై కూడా దాడి చేయడంతో మహేశ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఇద్దరిని చికిత్స కోసం జగిత్యాల తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు. బాధితుడు మేరుగు మనోహర్ ఫిర్యాదు మేరకు దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

అలాగే మల్యాలలోని ఒర్రెగడ్డ వైన్స్ వద్ద దసరా సందర్భంగా యువకులు పరస్పరం దాడులకు పాల్పడ్డా రు. వందలాది యువకులు పోగు అయి రహదారిపైనే దాడులకు పాల్పడడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో స్వల్ప ఘర్షణలు చోటుచేసుకోగా పోలీసులు పర్యవేక్షించారు.

జగిత్యాలలో ఒకరిపై దాడి

జగిత్యాల క్రైం, అక్టోబరు 13: జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఉన్న ఓ హోటల్‌లో కస్టమర్‌పై నిర్వాహకులు దాడి చేసిన ఘటన శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన కిషన్ అనే వ్యక్తి జగిత్యాలలోని ఓ హోటల్‌లో టిఫిన్ చేసేందుకు వెళ్లాడు. టిఫిన్ విషయంలో నిర్వాహకులతో వాగ్వాదం జరగడంతో కిషన్‌పై దాడి చేశారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

తండ్రి వర్ధంతికి వస్తూ.. కానరాని లోకాలకు..

- అదుపుతప్పి కారు బోల్తా.. యువకుడి మృతి

ఓదెల, అక్టోబరు 13: కన్నతండ్రి వర్ధంతి కార్యక్రమానికి హాజరుకావాలనే ఆతృత కొడుకు నిండు ప్రాణాలను బలితీసుకుంది. కారులో అర్ధరాత్రి అతివేగంగా ప్రయాణిస్తున్న క్రమంలో ఘోరరోడ్డు ప్రమాదానికి గురై తీవ్రగాయాలతో యువకుడు మృతిచెందిన ఘటన జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం వడ్డిచర్లలో జరిగింది. వివరాల్లోకెళితే.. పెద్దపెల్లి జిల్లా ఓదెల మండలం మడక గ్రామానికి చెందిన సోముల రవీందర్‌రెడ్డి(32) అనే యువకుడు నల్లగొండ జిల్లా కేంద్రంలో వండర్‌వరల్డ్ పేరిట ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో నల్లగొండ నుంచి స్వగ్రామం మడకలో తన తండ్రి రాంచంద్రారెడ్డి రెండో వర్ధంతి కార్యక్రమం ఆదివారం జరగనుండగా అక్కడికి సకాలంలో చేరుకునేందుకు తెల్లవారుజామున కారులో బయలుదేరాడు. ఈ క్రమంలో వడ్డిచర్ల శివారుకు చేరుకునే వరకు అతివేగానికి నిద్రమత్తు తోడై కారు అదుపు తప్పి రోడ్డుపక్కకు బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన రవీందర్‌రెడ్డిని స్థానికులు 108 ద్వారా జనగామ ఆసుపత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యలో మృతిచెందాడు. కాగా లింగాలఘణపురం ఎస్సై శ్రవణ్‌కుమార్ కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు. అయితే మృతుడికి తల్లి శ్రీలత, సోదరులు కిషన్‌రెడ్డి, రాజిరెడ్డిలు ఉండగా రాజిరెడ్డి వారం రోజుల క్రితమే ఉన్నత చదువుల నిమిత్తం లండన్‌కు వెళ్లడం గమనార్హం.


ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు, ఇన్‌సెట్‌లో రవీందర్‌రెడ్డి(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

శంకరపట్నం, అక్టోబరు 13: దసరా పండుగకు పెద్దమ్మ ఇంటికి వెళ్లి వస్తానని చెప్పిన ఓ యువకుడు శనివారం శంకరపట్నం మండలం తాడికల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. పోలీసుల కథనం ప్రకారం..చిగురుమామిడి మండలం లంబాడిపల్లెకు చెందిన బండారిపల్లి వినయ్ (25) కరీంనగర్‌లో నివాసం ఉంటున్నాడు. శనివారం దసరా పండుగకు తాడికల్‌లోని పెద్దమ్మ ఇంటికి వెళ్లి వస్తానని తండ్రి రామస్వామికి చెప్పాడు. వినయ్ కరీంనగర్ నుంచి బైక్‌పై వస్తుండగా, తాడికల్ శివారులోని శివాలయం సమీపంలోని మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టింది. దీంతో వినయ్ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. పండుగ పూట వినయ్ మృతితో కుటుంబసభ్యులు, బంధువులు రోదనలు మిన్నంటాయి. మృతుడు వినయ్ తండ్రి రామస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

భార్యను హత్య చేసిన భర్త


మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

వీర్నపల్లి, అక్టోబరు 13: మండలంలోని జవహర్లాల్ నాయక్ తండాలో భార్య గొంతుకు తాడు బిగించి భర్త హత్య చేశాడు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. జవహర్లాల్ నాయక్ తండాకు చెందిన గుగులోతు సుశీల (40)ను భర్త గుగులోతు రవి హత్య చేసి పరారయ్యాడు. రవి కొంతకాలంగా మద్యం తాగుతూ భార్య సుశీలతో గొడవ పడుతుండేవాడు. శనివారం దసరా పండగ రోజు ఆమె పిల్లలు లాల్ సింగ్ తండాలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లారు. రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న భార్యను తాడుతో గొంతుకు బిగించి హత్య చేసి ఇంటి ముందర మంచంపై పడుకోబెట్టి పరారయ్యాడు. ఆదివారం ఉదయం ఇంటికి చేరుకున్న కుమారుడు సాయిచరణ్, కూతురు షర్మిల ఇంటి ఎదుట మంచంపై విగత జీవిగా పడి ఉన్న తల్లిని చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న సుశీల కుటుంబసభ్యులు భర్త రవి హత్య చేసి పారిపోయాడంటూ పోలీసులకు తెలిపారు. సుశీల హత్యతో తండాలో విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐ శ్రీనివాస్ గౌడ్ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, ఇంటి తాళాన్ని పగలగొట్టి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో పరిశీలించారు. ఇంట్లో తాడు ఉండడంతో భర్తనే తాడుతో హత్య చేసినట్లు నిర్ధారించుకొని పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు.

నిందితుడు గుగులోతు రవిపై గతంలో పలు కేసులు నమోదయ్యాయి. ఇటీవల బ్లూ కోల్ట్స్ సిబ్బందిపై దాడి చేశాడు. మృతురాలి అన్న భూక్య లోక్‌నాయక్ ఫిర్యాదుతో గుగులోతు రవిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై ఎల్లాగౌడ్ తెలిపారు. ఎల్లారెడ్డిపేట ఎస్సై రమాకాంత్, గంభీరావుపేట ఎస్సై శివకుమార్, శిక్షణ ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు

అప్పుల వేధింపులతో ఒకరి ఆత్మహత్య


సాయికృష్ణ (ఫైల్)

తంగళ్లపల్లి, అక్టోబరు 13: అప్పు చెల్లించాలనే వేధింపులు భరించలేక తంగళ్లపల్లి మండలం మండెపల్లి కేసీఆర్ నగర్‌కు చెందిన దుబాసి సాయికృష్ణ (27) ఉరేసుకొని శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. కేసీఆర్ నగర్‌కు సాయికృష్ణ అదే కాలనీకి చెందిన నూతి అనిల్ వద్ద రూ.20 వేలు అప్పు చేశాడు. రెండు రోజుల క్రితం అప్పు చెల్లించాలని వేధింపులకు గురిచేసి సాయికృష్ణ ఫోన్‌ను బలవంతంగా లాక్కెళ్లాడు. అవమానంగా భావించి తీవ్ర మనస్తాపానికి గురై శనివారం దసరా పండుగ రోజు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. సాయికృష్ణకు భార్య ఉదయశ్రీ, కుమారుడు ఉన్నారు. నూతి అనిల్ వేధింపులతోనే తన కుమారు డు సాయికృష్ణ ఆత్మహత్య చేసుకున్నాడని తల్లి దుబాసి విజయ పోలీసుల కు ఫిర్యాదు చేసింది. అనిల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాంమోహన్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 13: మండల కేంద్రంలో అద్దెకు ఉంటూ స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రిలో డయాలసిస్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న కొప్పూరి మాధవ (27) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై రమాకాంత్ శనివారం తెలిపారు. మృతుడి స్వగ్రామం నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ గ్రామమని పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌కు చెందిన కొప్పూరి మాధవ మూడేళ్ల కిందట ఎల్లారెడ్డిపేటకు వచ్చి ఓ గదిని అద్దెకు తీసుకుని జీవిస్తున్నాడు. స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రిలో డయాలసిస్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. అదే ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న మరో నలుగురు యువకులతో కలిసి గదిలో ఉంటుండేవాడు.

ఈ నెల 11న ముగ్గురు ఆసుపత్రికి వెళ్లారు. రాత్రి మాధవ ఒక్కడే తలుపునకు గడియ వేసుకుని ఉన్నాడు. అదే రోజు రాత్రి 11.30 గంటలకు విధులు ముగించుకున్న యువకుడు అభిలాష్ గదిని చేరుకుని తలుపు తట్టాడు. ఎంత పిలిచినా మాధవ తలుపులు తీయకపోవడంతో తిరిగి అభిలాష్ ఆసుపత్రికి వెళ్లి నిద్రకు ఉపక్రమించాడు. ఈ నెల 12న అనుమానం వచ్చిన గది యజమాని తలుపులు పగులకొట్టి చూసే సరికి మాధవ మృతి చెంది కనిపించడంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు సోదరుడు శేషాద్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

● మానకొండూర్ మండలం వెల్దిలో..


త్రినాథ్(ఫైల్)

మానకొండూర్: మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన ఇల్లందుల త్రినాథ్ (21) అనే యువకుడు అనుమానాస్పదస్థితిలో వ్యవసాయబావిలో పడి మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్ది గ్రామానికి చెందిన ఇల్లందుల బాగ్యమ్మ-నాంపెల్లి దంపతులకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు త్రినాథ్ ఉన్నారు. పదో తరగతి చదివిన త్రినాథ్ ఆటో నడుపుతూ తండ్రికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. శనివారం త్రీనాథ్ తన మిత్రులు రుద్రారం తిలక్, కొమ్మగల్ల కిరణ్, రామగిరి సందీప్ కలిసి ఆటో(ఏపీ15టీసీ1433)లో మండలంలోని రంగపేట గ్రామ శివారులోకి వెళ్లారు. రాత్రి వరకు అక్కడే ఉన్నారు. అనంతరం త్రీనాథ్ వ్యవసాయబావిలో పడి మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు త్రీనాథ్ బావి వద్దకు చేరుకొని స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ లక్ష్మీనారాయణ పరిశీలించారు. బావిలో నీరు ఎక్కువగా ఉండడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. రాత్రి నుంచి తెల్లవారే సరికి బావిలోని నీరు తోడివేశారు. ఆదివారం బావిలో నుంచి మృతదేహాన్ని బయటికి తీశారు. పండుగ పూట ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రైలు కిందపడి మేషన్ కార్మికుడి ఆత్మహత్య

ఓదెల, అక్టోబరు 13: మండలంలోని పొత్కపల్లి 29వ, రైల్వే గేట్ సమీపంలో ఆదివారం ఇదే మండలం జీలకుంటకు చెందిన రెడ్డి ఆదిత్య (30) అనే మేషన్ కార్మికుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యాదవ సంఘం కమ్యూనిటీ భవన్ సమీపంలో గల అప్ రైల్వే లైన్ పట్టాల మధ్యన పడుకొని తలను లైన్ పైన పెట్టిన వెంటనే అదే లైన్‌లో వస్తున్న రైలు డ్రైవర్ హారన్ కొట్టిన కూడా పక్కకు జరగకపోవడంతో రైల్ చక్రాల కింద తల నుజ్జునుజ్జయింది.

ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఇప్పటివరకు జీ.ఆర్.పి పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు, కూతురు ఉన్నారు. శనివారం వరకు పండుగల వేడుకల్లో కుటుంబంతో, మిత్రులతో గడిపిన ఆదిత్య మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

వైశ్య సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ



లక్ష్మీనారాయణకు నియామక పత్రాన్ని ఇస్తున్న ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు

కరీంనగర్ టౌన్, అక్టోబరు 13: ఆర్యవైశ్య మహాసభ అనుబంధ వైశ్య సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన పోకల లక్ష్మీనారాయణను నియమించారు. ఆదివారం ఈమేరకు ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు కన్న కృష్ణ, సేవాదళ్ అధ్య క్షుడు ఎలగందుల మునీందర్ లక్ష్మీనారాయణకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో వైశ్యుల అభ్యున్న తికి, మహాసభ పటిష్టతకు కృషిచేయాలని, సేవాదళ్‌ను బలోపేతం చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొమురవెల్లి వెంకటేశం పాల్గొన్నారు.

కవి సమ్మేళనం



మాట్లాడుతున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 13: నగరంలోని ఎస్ఎఫ్ఎస్ గార్డెన్‌లో ఇదారె ఆదాబ్ ఇస్లామీ సంస్థ ఆధ్వర్యంలో శనివారం అఖిలభారత ఉర్దూ కవి సమ్మేళనం నిర్వహించారు. ఈకార్యక్రమానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ ముషాయిరాలు సమాజానికి మేలు కొలుపులా దోహదపడుతాయని అన్నారు. సామాజిక అసమానతలు రూపు మాపి ప్రజలను తట్టి లేపేందుకు కవి సమ్మేళనాలు తోడ్పడుతాయని అన్నారు.

అనంతరం సియాసత్ ఉర్దూ పత్రిక ఎడిటర్, కాంగ్రెస్ పార్టీ ఎంఎల్‌సి ఆమెర్‌అలీఖాన్‌ను నరేందర్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ హసన్ రజా, షోయబ్ హక్ తాలిబ్, మిసార్ అహ్మద్, లాయక్ అలీవార్సి, నయూమ్ అక్తర్ ఖాద్రి, డాక్టర్ ఫరీద్ మోనిస్, అనస్ నబీల్ అకోరా, రియాజ్ అలీ రజ్వీ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళి

భగత్‌నగర్, అక్టోబరు 13: నగరంలో ఆదివారం యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ సాయిబాబా మృతికి సంతాపం ప్రకటించారు. ఈసందర్భంగా భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యుఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు తాటికొండ రవి, మాదం తిరుపతిలు మాట్లాడుతూ ప్రొఫెసర్ సాయిబాబా ఆలోచనలను ముందుకు తీసుకు వెళ్తామని అన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా సాయిబాబాపై ప్రభుత్వం తప్పుడు కేసులు బనాయించిందని ఆరోపించారు. ఒక మేధావి పట్ల కేంద్రం ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు.

'ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు చేసుకోండి'

కరీంనగర్ టౌన్, అక్టోబరు 13: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రభుత్వ, అర్హులైన ప్రైవేట్ ఉపాధ్యాయులంతా వెంటనే తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఎమ్మెల్సీ అభ్యర్థి, మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం నగరంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియ నవంబర్ 6తో ముగియనున్నందున తమ పేర్లను నమోదు చేసుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. దరఖాస్తు ఫారాలను ఆన్‌లైన్‌లో కానీ, రెవెన్యూ కార్యాలయాల్లో కానీ నేరుగా సమర్పించి ఓటరుగా నమోదు చేసుకోవచ్చని అన్నారు. ఉపాధ్యాయ, అధ్యాపకుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్సీగా కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్నానని, ఓటరుగా నమోదై తనను గెలిపించాలని టీచర్లకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తుమ్మల రమేశ్‌రెడ్డి, మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, మెంగని తిరుపతిస్వామి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

బావిలో దూకి యువకుడి ఆత్మహత్య

తిమ్మాపూర్, అక్టోబరు 13: మండలంలోని మల్లాపూర్ గ్రామంలో మతిస్థిమితం కోల్పోయిన యువకుడు ఆదివారం సాయంత్రం వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్ గ్రామానికి చెందిన బత్తిని వెంకన్న-కళ దంపతులకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. కొన్ని సంవత్సరాల క్రితం ఇద్దరు కొడుకులు కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో పెద్ద కుమారుడు బత్తిని సాయి(24) తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో మతిస్థిమితం కోల్పోయాడు. అప్పటి నుంచి ఇంటి వద్దే ఉంటున్నాడు. ఆదివారం సాయి తన తల్లితో కలిసి సాయంత్రం పొలం వద్దకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో తన తల్లిని పక్కకు తోసేసి సాయి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో దూకాడు. గ్రామస్థులకు, పోలీసులకు సమాచారం అందించడంతో బావిలో నుంచి సాయిని బయటికి తీశారు. అప్పటికే సాయి మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గీత కార్మికుడికి గాయాలు

వీణవంక అక్టోబరు 13:మండలంలోని వల్భాపూర్ గ్రామానికి చెందిన పల్లె స్వామి తాటి చెట్టు పై నుంచి పడగా తీవ్ర గాయాలయ్యాయి.గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. స్వామి శుక్రవారం తాటి చెట్టు ఎక్కె క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. గమనించిన తోటి గీత కార్మికులు జమ్మికుంట ప్రభుత్వ అనుపత్రికి తరలించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

హుజూరాబాద్, అక్టోబరు 13: పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం విశ్వప్రగతి విద్యాలయంలో 2010-11లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాడు వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

రేపటి నుంచి గాలికుంటు నివారణ టీకా పంపిణీ

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 13: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో మంగళవారం నుంచి గాలికుంటు నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని సింగాపూర్ గ్రామ పశు వైద్యాధికారి డాక్టర్ పి రవీందర్‌రెడ్డి, చెల్పూర్ పశువైద్యాధికారి డాక్టర్ రాజేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడి రైతులు తప్పనిసరిగా టీకా వేయించానలి సూచించారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కన్వీనర్‌గా ఎల్లారెడ్డి

శంకరపట్నం, అక్టోబరు 13: తెలంగాణ ఉద్యమకారులు, శంకరపట్నం మండల మాజీ వైస్ ఎంపీపీ కన్నాపూర్ గ్రామానికి చెందిన మోతె ఎల్లారెడ్డిని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్‌గా ప్రకటించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి మాట్లాడుతూ ఈ నియామకానికి సహకరించిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ముఖ్య సలహా దారుడు ఓరుగంటి ఆనంద్, జిల్లా చైర్మన్ కనకం కుమారస్వామి మండలాధ్యక్షులు, రాష్ట్ర నాయకులకు, జిల్లా బాధ్యులకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

-రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

తిమ్మాపూర్, అక్టోబరు13: సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, దానికి ప్రజల సహకారం తీసుకుంటామని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం దసరా వేడుకల్లో భాగంగా తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల రాంలీల మైదానంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నేతృత్వంలో రాంలీలా దసరా ఉత్సవాలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర రవాణా, బీసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా పండగ చెడుపై గెలుపునకు నిదర్శనం అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో విద్య, వైద్య రంగాల అభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలపై ప్రజలకు భరోసా ఇస్తున్నామని అన్నారు. ఎమ్మెల్యేగా కవ్వంపల్లి సత్యనారాయణ గెలుపొందిన తరువాత నిరంతరం నియోజకవర్గంలోనే ప్రజలకు అందుబాటులో ఉంటున్నారన్నారు. నియోజకవర్గ సమస్యలపై ముఖ్యమంత్రితో పాటు మంత్రుల వద్ద నేరుగా మాట్లాడి వాటిని పరిష్కరించేందుకు ఎంతో కృషి చేస్తున్నారని కవ్వంపల్లి సత్యనారాయణను అభినందించారు. మానేరు నది ఒడ్డున రాంలీలా వేడుకలు నిర్వహించడం చాలా బాగుందని మంత్రి పొన్నం ప్రభాకర్ కితాబిచ్చారు.



ఎల్ఎండీ కాలనీలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్



కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు

రాష్ట్రంలో ప్రజా పాలన సాగుతోంది

-ఎమ్మెల్యే కవ్వంపల్లి

గత ప్రభుత్వం హయాంలో మానకొండూర్ నియోజకవర్గంలో ఏమైనా అభివృద్ధి చేశారా ఆటా పాటలతోనే సరిపెట్టారా అని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌పై ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆరోపించారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన కొనసాగుతోందని, బీఆర్ఎస్ నియంతృత్వ పాలనకు ప్రజలు చరమగీతం పాడారని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. గత ప్రభుత్వ హయాంలో మానకొండూర్ నియోజకవర్గంలో రసమయి ఎటువంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. కుల, మత, వర్గ బేధాలు లేకుండా అందరు పేద ప్రజలు ఒకే గూటి కింద చదువుకోవాలనే నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను మంజూరు చేయించుకున్నామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం జూన్ నాటికి ఈ పాఠశాల ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. అనంతరం చివరి ఘట్టంగా రవాణాసుర వధ, భారీ క్రాకర్స్ షోతో రాంలీలా మైదానం పరిసరాలు వివిధ రంగులలో అందరినీ ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి అనురాధ, కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, టీఎస్టీఓ రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, ఆర్డీవో మహేశ్వర్, ఇరిగేషన్ ఎస్ఈ పెద్ది రమేష్, ఈఈ నాగభూషణం రావు, రాంలీలా ఉత్సవ కమిటీ కన్వీనర్ కుంట రాజేందర్ రెడ్డి, ఇతర అధికారులు, కాంగ్రెస్ నాయకులు, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

భగత్‌నగర్, అక్టోబరు 13: నగరంలోని హిందూపూర్ కాలనీ (39వ) డివిజన్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. హిందూపూర్ కాలనీ బీజేపీ నాయకులు ఊట్కూరి భార్గవి-రాధకృష్ణరెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిర్మలారెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ఏర్పాటు

కరీంనగర్ రూరల్, అక్టోబరు13: కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామ పరిధిలోని శ్రీపురం కాలనీలో ఎస్‌జీఎఫ్ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, కాలనీ వాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నవరాత్రోత్సవాలు

కరీంనగర్ రూరల్, అక్టోబరు13: అమ్మవారి శక్తి ముందు సకల ప్రాణకోటి అల్పమైనదేనని దుర్గాభవాని ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వర శర్మ అన్నారు. కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని శ్రీ దుర్గా భవానీ ఆలయంలో దుర్గా భవానీ నవరాత్రుల చివరి రోజు ఆదివారం సుందరేశ్వరుల దుర్గా భవానీల పట్టాభిషేక మహోత్సవాన్ని ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వర శర్మ కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఆలయ మాడ వీధుల్లో సుందరేశ్వరుల దుర్గ భవానీల రథోత్సవాన్ని నిర్వహించారు. దుర్గా భవానీ అమ్మవారు అర్ధనారీశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ పూజ కార్యక్రమాల్లో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్, ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇంక్రిమెంట్లు ఇప్పించండి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 13: నగరపాలక సంస్థలో గత 33 సంవత్సరాలుగా ఎన్ఎంఆర్‌గా పనిచేస్తున్న మాకు ఇంక్రిమెంట్లు, ఏరియర్స్, సర్వీసు బుక్ ఇప్పించాలని ఎన్ఎంఆర్ వర్కర్స్ ఎ.సత్తయ్య, భారతి, ఎస్.జనార్దన్, వి.లక్ష్మయ్య, ఆర్.రాజేశం, ఎండి ఫహీమ్‌ఖాన్, సిహెచ్.దానయ్య టి.లింగమ్మ, వి.ఒదెలు, కె.రాజయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు కరీంనగర్‌లో రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వారు వినతిపత్రం సమర్పించారు.

ఉత్సాహంగా 'అలాయ్..బలాయ్'

కరీంనగర్ టౌన్, అక్టోబరు 13: విజయదశమి (దసరా) పండుగను పురస్కరించుకొని కరీంనగర్‌లోని ఆర్యవైశ్య అభ్యుదయ సంఘాల అధ్యక్షుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అలాయ్..బలాయ్ కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి పూజానంతరం వేదపండితులు ఆశీర్వచనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆదివారం నగరంలోని ఎంఆర్ వైశ్యభవన్‌లో భగత్‌నగర్, గణేశ్‌నగరల్, మారుతినగర్, టవర్‌సర్కిల్, ఎంఆర్ వైశ్యసంఘాల అధ్యక్షులు కొల్లూరి హరిప్రసాద్, కొలిపాక శ్రీనివాస్, యాంసాని అశోక్, సామ లక్ష్మన్, పాత రాధాకిషన్ అధ్యక్షతన జిల్లాలో ప్రప్రథమంగా దసరా అలాయ్‌భలాయ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి మహాసభ జిల్లా అధ్యక్షుడు కన్న కృష్ణ, ప్రధాన కార్యదర్శి కొమురవెల్లి వెంకటేశం, పట్టణ అధ్యక్షుడు నగునూరి రాజేందర్, వైశ్య సేవా కేంద్రం ప్రధాన కార్యదర్శి పెద్ది విద్యాసాగర్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ఎలగందుల మునీందర్, కార్పొరేటర్లు కొలిపాక అంజయ్య, వంగల శ్రీదేవి పవన్‌కుమార్, యువత, మహిళ, పట్టణంలోని 16 శ్రీవాసవీ మాత ఆర్యవైశ్య అభ్యుదయ సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారులు, ముఖ్యనాయకులు, హాజరయ్యారు. ఈ సందర్భంగా నగరంలోని పేద వైశ్యులకు చేయూత నివ్వాలని, కర్మకాండ నిలయం నిర్మించాలని, వైశ్యుల సమస్యల పరిష్కారానికి, అభ్యున్నతికి తోడ్పాటును అందించాలని వక్తలు తమ ప్రసంగంలో పేర్కొన్నారు.

రాష్ట్రంలో జాతీయ విద్యాసంస్థలు ఏర్పాటు చేయాలి



కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి వినతిపత్రం ఇస్తున్న ఇండియన్ స్టూడెంట్ యూనియన్ నాయకులు

భగత్‌నగర్, అక్టోబరు13: రాష్ట్రంలో జాతీయ విద్యాసంస్థలు ఏర్పాటు చేయాలని ఇండియన్ స్టూడెంట్స్ యూనియన్ నాయకులు కోరారు. ఆదివారం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కలిసి ఐఎస్‌యు జాతీయ అధ్యక్షుడు పాపని నాగరాజు, రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఐఐఎం, ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, కేంద్ర విశ్వవిద్యాలయం అదనంగా తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ విద్యాసంస్థలు, విశ్వ విద్యాలయాల్లో విద్యార్థనే లక్ష్యంగా అడ్మిషన్లకు డిమాండ్ ఉందన్నారు. ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో మిగిలిన సీట్లు ఖాళీగా ఉంచకుండా ర్యాంకు దగ్గరలో ఉన్నవారు, క్వాలిఫై అయిన వారితో భర్తీచేసే విధంగా ఒత్తిడి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో బి రవి, పి వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, అక్టోబరు 13: నగరంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టు ఏడీఈ సుదీర్ కుమార్ తెలిపారు. ముకరంపుర, గౌతమినగర్, విఘ్నేశ్వర కాలనీ, టౌన్ పోలీస్ స్టేషన్ వెనుకవైపు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

యజ్ఞేత కల్పత యాప్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి

భగత్‌నగర్, అక్టోబరు 13: నగరంలోని మహాశక్తి దేవాలయంలో శనివారం యజ్ఞేత కల్పత యాప్‌ను కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హిందు శక్తి ధర్మం తెలిసేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. సనాతన హిందు ధర్మ గొప్పతనం అవశ్యకత తెలిపే విధంగా రూపొందించిన యాప్ బాగుందన్నారు. హిందు శక్తులు ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. సనాతన ధర్మంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడే వారికి సమాధానం ఇచ్చే విధంగా కరీంనగర్ యువకులు గొప్ప ప్రయత్నం చేశారన్నారు. భారతీయ గొప్పతనం, ఆవిష్కరణలు ఇంజనీరింగ్ శాస్త్రసాంకేతిక అద్భుత ఆవిష్కరణలను యాప్‌లో ఆవిష్కరించారన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

కరీంనరగ్ రూరల్, అక్టోబరు 13: కరీంనగర్ మండలంలో ఈనెల 15 నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధకట టీకాలను వేస్తున్నట్లు బొమ్మకల్ ఇన్‌చార్జి పశు వైద్యాధికారి జి శ్రవణ్ కుమార్ తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను ఈనెల 15 నుంచి వచ్చే నెల 14 వరకు వేసేందుకు జేవీవోలు కె సమ్మయ్య, టీ రాజు ఆధ్వర్యంలో రెండు బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈనెల 15న ఆరపల్లిలో , 16న తీగలగుట్టపల్లిలో 17 వల్లపంహాడ్‌లో, 17,19న నగునూర్, 21న ఎలబోతారం, 22న జూబ్లీనగర్, 23న ఫకీర్ పేట, 24,25 చామనపల్లి, 26న దుబ్బపల్లి, 28న బహదూర్‌ఖాన్ పేటలో టీకాలు వేస్తామన్నారు. 29న తాహెర్ కొండాపూర్, 30న నవంబర్1న చెర్లబూత్కూర్, 2,4 తేదిల్లో మొగ్దుంపూర్, 5న చేగుర్తి, 6న నల్లగుంటపల్లిలో, 7,8న దుర్శేడ్, 9న ఇరుకుల్ల, 11,12 న గోపాల్ పూర్, 13,14న బొమ్మకల్ గ్రామాల్లోని పశువులకు గాలికుంటు వ్యాధి నియంత్రణ టీకాలను వేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దుర్గామాత నిమజ్జనం

ఇల్లందకుంట, అక్టోబరు 13: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో దుర్గామాత నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పదిరోజుల నుంచి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామంలో భారీ ఊరేగింపు అనంతరం నిమజ్జనం చేశారు.

వీణవంక: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో దుర్గమాత నవరాత్రి ఉత్సవాలు కొనసాగాయి. శనివారం ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

కొవ్వొత్తుల నివాళి

హుజూరాబాద్, అక్టోబరు 13: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం ప్రొఫెసర్ సాయిబాబు మృతికి సంతాపంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయిబాబు చిత్రపటానికి పూలమాలలు వేసివేసి నివాళులర్పించారు.

యునెస్కో విద్యా సదస్సులో ప్రసంగం

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 13: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ కొత్తిరెడ్డి మల్లారెడ్డి భారతదేశం తరపున శనివారం ఉజ్బెకిస్తాన్‌లోని తాష్కెంట్ అల్ఫ్రాగానస్ యూనివర్సిటీలో జరిగిన యునెస్కో ఆసియా పసిఫిక్ వ్యవస్థాపక విద్యా సదస్సులో ప్రసంగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రసంగంలో 21వ శతాబ్దంలో యువత ఎదుర్కొంటున్న సంక్లిష్ట సవాళ్లను అధిగమించే విద్యా విధానాల పై వివరించారని పేర్కొన్నారు. సదస్సులో 40 దేశాల నుంచి 200ల మంది ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

గంగాధర, అక్టోబరు 13: రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ క్రికెట్ పోటీలకు గంగాధర ప్రభుత్వ పాఠశాల విద్యార్థి అస్లాం ఎంపికైనట్లు పీడీ బాబు శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 4న సిరిసిల్ల జిల్లాలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో అండర్-14 విభాగంలో అస్లాం ప్రతిభ చాటాడని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలు ఈనెల 14 నుంచి 17 వరకు జోగులాంబ జిల్లాలో నిర్వహించే ఎస్‌జీఎఫ్ క్రికెట్ పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనిత, సీనియర్ క్రీడాకారుడు రాగూర్ తదితరులు అస్లాంను అభినందించారు.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు సన్మానం

రామడుగు, అక్టోబరు 13: రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదను ఆదివారం గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ పాలకవర్గం సన్మానించింది. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బొమ్మరవేణి తిరుమల తిరుపతిముదిరాజ్, వైస్ చైర్మన్ పిండి సత్యంరెడ్డి, డైరెక్టర్లు మేకల కుమారస్వామి, తొర్రికొండ నారాయణ, జక్కుల బాబు, పొన్నం కనుకయ్య, బదుగు ఎల్లయ్య, పోడేటి శంకరయ్య, వేణుగోపాల్‌రెడ్డి, మొలుగూరి రాజశేఖర్, పురంశెట్టి లక్ష్మణ్, కుంబాల రాజేశం, మండల అధ్యక్షుడు బొమ్మరవేణి తిరుపతి, మాజీ ఎంపీపీ జవ్వాజి హరీష్, కొల రమేశ్, వజీతు ఎంపీటీసీ రత్నాకర్, శనిగరపు స్వామి, నేరెళ్ల మారుతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దసరా వేడుకలు

- భక్తిశ్రద్ధలతో శమీ పూజలు
- పాల్గొన్న నాయకులు, ప్రజలు



చొప్పదండిలో శమీ పూజ చేస్తున్న ప్రజలు

హుజూరాబాద్, అక్టోబరు 13: హుజూరాబాద్ పట్టణంలో విజయదశమి వేడుకలను ప్రజలు శనివారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక ఆధ్వర్యంలో రావణసూరుడి వధ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరయ్యారు. హుజూరాబాద్ టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. యూత్ సభ్యుల ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాల ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రంగాపూర్ తదితర గ్రామాల్లో రావణ దహనాన్ని నిర్వహించారు.

శంకరపట్నం: మండల వ్యాప్తంగా దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రజలు దాండియా ఆడుతూ అమ్మవారిని నిమజ్జనం చేశారు.

సైదాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి రావణ దహనం నిర్వహించారు. సాయంత్రం వేళలో ఉత్సవాలు నిర్వహించారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శమీ వృక్ష పూజ ప్రత్యేక కార్యక్రమాలు వేదబ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య నిర్వహించారు. విజయదశమి సందర్భంగా గ్రామ దేవాలయంలో స్వామివారికి పంచామృత అభిషేకం, అర్చనలు, వాహనపూజలు చేపట్టారు.

వీణవంక: మండల వ్యాప్తంగా దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. వీణవంకలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి దసరా వేడుకల్లో పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: కరీంనగర్ ఐఎంఏ ఆధ్వర్యంలో దసరా వేడుకలను ఐఎంఏ హాలులో శమీ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్, కార్యదర్శి డాక్టర్ ఎస్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలంలో అన్ని గ్రామాల్లో విజయ దశమి వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి: మండలంలో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. చొప్పదండిలో వీహెచ్‌పీ, హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో రాంలీల కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్వామి రాదా మనోహర్‌దాస్, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, వీహెచ్‌పీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలో దసరా సందర్భంగా గ్రామాల్లో వేదపండితుల సమక్షంలో స్వామి వారి రథాన్ని ఊరేగించారు. మానకొండూర్‌లో నిర్వహిస్తున్న రథోత్సవంలో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మాజీ జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

గంగాధర: మండల వ్యాప్తంగా జమ్మి చెట్టు వద్ద శమీ పూజ నిర్వహించేందుకు డప్పుచప్పుళ్లతో జమ్మి చెట్టు వద్దకు చేరుకున్నారు. ఏలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ నరేందర్‌రెడ్డి పర్యవేక్షించారు.

రామడుగు: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో శనివారం దసరా వేడుకలు ఘనంగా కొనసాగాయి. నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రతిష్ఠించిన దుర్గామాత ఊరేగింపు ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు.

చిగురుమామిడి: మండల వ్యాప్తంగా దసరా వేడుకలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్ లోఎస్సై బండి రాజేశ్ ఆధ్వర్యంలో ఆయుధ పూజ నిర్వహించారు.



పూజలు చేస్తున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



తీగలగుట్టపల్లిలో శమీ పూజ నిర్వహిస్తున్న స్థానికులు



హుజూరాబాద్‌లో రావణ వధ నిర్వహిస్తున్న స్థానికులు